# కథకుడు

నిద్ర తోసుకువస్తోంది నారాయణమూర్తికి. రాత్రంతా పెట్టి పొట్ట చెక్కలయ్యేంత జనం. తిమ్మిరెక్కిన కాలు బరువు రెండో కాలుమీదికి మార్చుకునేందుకుగూడ వీలు లేకపోయింది జనం వత్తిడిలో.

'పెట్టె ఖాళీ అయిందిగదా నడుం వాలుద్దాం' అనుకుంటే సరిగా రైలు కదిలేముందు యీ "పిల్లలకోడి" తయారైంది. వాళ్లు పిల్లలుకాదుట టపాకాయలు. ఏడేళ్ళవాడొకడూ, ఆరేళ్ళ వాడొకడూ, అంతకంటె చిన్నవాడింకొకడూ; కూర్చున్నచోట కూర్చోడు ఒక్కడూనూ. చిన్నవాడు కొత్తచెప్పులు తొడుక్కొని, కిర్రు కిర్రు మనిపిస్తూ, బల్లమీదనుంచి బల్లమీదకు దూకుతున్నాడు కోతిలా. పెద్దవాడు పాటలు పాడుతున్నాడు. అంతకంటె చిన్నవాడు కిటికీ తలుపుమీద దరువు నేర్చుకుంటున్నాడు. ఆవిడ మాత్రం కూర్చుంది. కదలకుండా మెదలకుండా చలిమిడి ముద్దలా. గుండ్రని విగ్రహమూ ఆవిడాను గుమ్మడికాయలా ఆవిడ గుమ్మడికాయ అని నవ్వుకున్నాడు.

'వీడెవ్వడో బుద్ధిమంతుడే' అనుకుంది ఆవిడ. మనిషి మాట్లాట్టంలేదు. కాళ్లు ముడుచుకుని ఎదురు బెంచీమీద పెట్టుకుని కూర్చున్నాడు. చిన్నవాడు జారి ఆయనమీద పడ్డంత పనిచేశాడు. ఆప్యాయంగా వాడి చెయ్యిపట్టుకుని నిల

బెట్టి నడిపించాడు. కన్నెఱ్ఱ చెయ్యలేదు. నోరు బిగబట్టలేదు. ఏదో కాస్త వాళ్ళతో మాట్లాడితే తను ఒక్క కునుకు తీయొచ్చు. ఏమో! పిల్లల్ని చూచే పెద్దమనిషిగా కనిపించ టం లేదు.

ఈ చిన్నవాడిని గంతులు మానమనదేం ఆవిడ? పెద్ద వాడి పాటవిని ఆనందిస్తోందా? వాడు ఎవరితోనో పందెం వేసి నట్లున్నాడు; ఈ ఒక్క పంక్తి వెయ్యిసార్లు గుక్క విడువ కుండా చదవగలనని అంతకంటే చిన్నవాడి దరువుకీ, యీ పాటవిసుగుకీ రైలు మోతకీ...!

అంతకంటే చిన్నవాడు దరువు ఆపడు.

"అమ్మ!" అన్నాడు ఆ రేళ్ళవాడు.

అమ్మ మాట్లాడలేదు.

వాడు అద్దాలకిటికీ పైకి లేపి భడాలున వదిలాడు. అమ్మ వులిక్కిపడింది. "ఏమిట్రా?" అంది బెదురుతో ముఖం పెట్టి, విసుగుతో ముగించుతూ.

"అమ్మా! మనం ఆ పెట్టెలో ఎందుకెక్కలేదమ్మా" అన్నాడు వాడు.

"అది పరుపుల పెట్టె బాబూ" అన్నది ఆమె.

"అదేనమ్మా. పరుపుల పెట్టెలోనే ఎందుకెక్కలేదూ అని అడుగుతున్నా" అన్నాడు వాడు.

"అందులో ఖాళీ లేదు" అన్నది. వాడంతటితో వూరు కుంటాడా అని సందేహిస్తానే.

"ఖాళీ వుంది!"

"అందులో కంటే యిందులో యెక్కువ ఖాళీ వుంది."

"అందులోనూ ఖాళీవుంది."

"అందులో పరుపులున్నాయి."

"అందుకనే అందులో ఎందుకెక్కలేదూ అని అడుగుతున్నా?"

"అక్కడ కూర్చుంటే డబ్బెక్కువౌతుంది."

"ఇక్కడైతే?"

"తక్కువౌతుంది."

"అయితే అందులో వాళ్ళిందులో యెందుకెక్కలేదు?"

"అక్కడయితే హాయిగా వుంటుందని."

"అందుకనే మనం ఎందుకెక్కలేదూ అని అడుగుతున్నానమ్మా" అన్నాడు వాడు.

"ఆఁ చూడు అటు. అటు చూడరా తుమ్మచెట్లు యెట్లా తిరుగుతున్నాయో చూడరా!" అని అమ్మ ప్రోత్సహించింది. కిటికీలోనుంచి చెయ్యి బయటకుపెట్టి చూపిస్తూ.

ఆ చిన్నవాడు అలాంటి తుమ్మచెట్లు చాలాచూచాడు. ఆ పెద్దవాడు పాడటం మొదలుపెట్టిన పాట యింకా మొదటి పంక్తి దాటలేదు. అందరికంటే చిన్నవాడికింకా కొత్త చెప్పుల సరదా తీరలేదు. మోకాళ్ళు నొప్పిపెట్టలేదు. నారాయణమూర్తికింకా నిద్రదోసుకు వస్తూనే వుంది.

పెట్టెలో మొదటి తమ్ముడు అమ్మవొళ్ళో పండుకుని అమ్మ గడ్డం తన వేపుకి తిప్పాడు :

“అందులో వాళ్ళు యిందులో యెందుకెక్కలేదూ అని అడుగుతున్నానమ్మా!” అని అరిచాడు.

‘ఈ పెద్దమనిషికీ యీ గొడవంతా పట్టినట్టే లేదేం? వులకడు; పలకడు’ అనుకుంది ఆవిడ. అనుకోని నారాయణమూర్తి కేసి చూచింది. నారాయణతల మోకాళ్ళమీద నుంచి లేచి ఆవిడవంక చూచింది, నిద్రతో వూగుతూ.

“నా కర్మయింతే! నాకు నిద్రబొయ్యే రాత లేదులే!” అంటూ వూగింది నారాయణమూర్తి తల; ఆవిడ మనస్సు చివుక్కుమన్నది.

“ఒరే పెద్దోడా పాటమాని యిట్లారా ఒరేయి చిన్నోడా గంతులుమాని నువ్విట్లా రారా అంటే!” అని అంటూంటే ఆవిడ పెట్టుకున్న కుంకమబొట్టు నిలువునా పగిలింది.

అందులో వాళ్ళు యిందులో యెందుకెక్కలేదూ అని అడిగానమ్మా” అన్నాడు రెండోవాడు.

“మంచి కథ చెబుతా యిట్లా రండిరా అంటే వింటారా పెడతారా” అని కదలబోయింది. ఆవిడ చలివిడిసుద్ద కదిలినట్లూ గుమ్మడికాయ దొర్లిపోయినట్లూ.

పిల్లల కిదంతా చూస్తే శుభసూచకంగా కన్పించ లేదు. ఆవిడ కదలబోవటమూ, కథ చెప్పాలనుకోవటమూ, అందరి కంటే పెద్దవాడు కుక్కిన పేనులా పాటమానేసివచ్చి అమ్మ

కెదురుగా కూర్చున్నాడు. అందరికంటే చిన్నవాడు గెంతటం మాని నోట్లో కుడిచేతి బొటనవ్రేలు పెట్టుకున్నాడు.

"అనగా అనగా ఒక వూళ్లో ఒక రాజున్నాడు" అన్నది అమ్మ. అందరికంటే చిన్నవాడు బెదురుబెదురుగా అమ్మ పక్కకొచ్చి కూర్చున్నాడు. అమ్మ కథ చెప్పింది. ఆ రాజు కొక కూతురు. చక్కని చుక్క. చెప్పిన మాట వినేది. బళ్లో కెళ్ళేది. పాఠాలు చక్కగా వప్పచెప్పేది. అబద్ధాలాడే కాదు. స్నానం చెయ్యమంటే యేడ్చేదికాదు. మంచి పిల్ల. అందరూ మెచ్చుకున్నారు ఆ అమ్మాయి మంచితనం చూసి. అందుకని ఒకసారి ఆ అమ్మాయి నదిలో పడింది. అందరూ కలిసి ఆ అమ్మాయిని బయటికితీసి రక్షించారు.

ఇట్లాగే నడిచింది కథ. కథ చెప్తూ అప్పుడప్పుడూ మధ్యలో ఆగింది ఆవిడ. ఆవిడ ఆగలేకపోతే పిల్లలు ప్రశ్నలు వేసి ఆపారు. వాళ్ళు ఆపకపోతే ఆవిడ ఆగకాపోలేదు.

"ఆ యమ్మాయి మంచమ్మాయి కాకపోతే వాళ్లు రక్షించేవాళ్ళు కాదా!" అన్నాడు పెద్దవాడికంటే చిన్నవాడు ఆవిడ వళ్ళోనుంచి లేచి. సరిగ్గా అదేప్రశ్న నారాయణమూర్తి గూడ అడుగుదామనుకున్నాడు.

"ఏమోలే! రక్షించేవాళ్లేనేమోకాని ఆ యమ్మాయి అంతమంచిది కాకపోతే వాళ్ళంత తొందరగావెళ్ళి రక్షించే వారు కాదనుకుంటా" అన్నది అమ్మ. అంటూ నసిగింది కూడాను.

"ఛా! ఏంకథ!" అన్నాడు అందరికంటే పెద్దవాడు.

"యెధవకథ" అన్నాడు అందరికంటే చిన్నవాడు, వాడికి మాటలొచ్చు.

"మీ కథ వాళ్ళకి నచ్చలేదనుకుంటానండీ" అన్నాడు నారాయణ. ఆవిడకీ తెలుసు వాళ్ళకా కథ నచ్చలేదని. అందుకనే ఆవిడకి చుర్రుమంది.

"అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే యెట్లాగండీ? వాళ్ళకి మంచి కథలు నచ్చవు ఈ వెధవచచ్చు సినిమాలు చూచేవాళ్ళకి మంచి కథలెందుకు నచ్చుతయ్యా" అని దీర్ఘం తీసింది ఆవిడ.

"మీరనేదాంతో నే నొప్పుకోనండీ అంటాడనుకుంది ఆవిడ చివరికి. "మీరు చెప్పండి వాళ్ళకి నచ్చేకథ చూద్దాం" అన్నది ఆవిడ. ఈ లోపుగా ఒక కునుకు తీద్దామని.

"మీరు చెప్పండి!" అన్నాడు పెద్దవాడు. రెండోవాడు లేచి నారాయణమూర్తి ప్రక్కకి దూరాడు. మూడోవాడు చీకటం మానేశాడు. నారాయణమూర్తి మొదలు పెట్టాడు.

అనగా అనగా ఒకవూళ్లో...

పిల్లలకిదంతా ఏమీ నచ్చలేదు. అన్ని కథలూ యిట్లాగే మొదలు పెడతారేమిటి అందరునూ?

నారాయణమూర్తి కథలో అబ్బాయి మంచివాడు. చెప్పినమాట వినేవాడు. వేరుశనక్కాయలు బెల్లం లేకుండా తినేవాడు. అన్నంలోకి నెయ్యి కావాలని యేడ్చేవాడుకాదు. కూరలో కారం యెక్కువ కాకపోయినా మంటపుడుతోందని రోజేవాడు కాదు. పంతులు ఒకపాఠం చెబితే రెండు పాఠాలు

చదివేవాడు. ప్రక్కవాడి బలపం పోతే తన బలపం యిచ్చే వాడు దిద్దుకొమ్మని. వాళ్ళమ్మ అరిసెలు చేస్తే బళ్లోకి పట్టికెళ్ళి అందరికీ పంచిపెట్టేవాడు.

"ఆ అబ్బాయి యెర్రగా వుండేవాడా?" అని అడిగేడు ఆరేళ్ళ వాడు.

"ఎరుపేగాని! మీ కంటే ఒక ఛాయ తక్కువ" అన్నాడు నారాయణమూర్తి. పెద్దబ్బాయి నారాయణ మూర్తి వేపుకి తిరిగాడు. అందరికంటే చిన్నవాడు కొత్త చెప్పులు కిర్రుమనిపించాడు.

"మీకంటే ఒక ఛాయ తక్కువేకాని దారుణమైన తెలివితేటలు వాడివి" అన్నాడు నారాయణమూర్తి. తెలివి తేటలు దారుణంగా యెందుకుంటాయో పిల్లల కర్థంకాలేదు. మొత్తంమీద యీ దారుణమైన తెలివి తేటలున్న కుర్రాడంటే వాళ్ళకి యిష్టం కలుగుతున్నట్లనిపించింది. అందుకని అందరికంటే పెద్దవాడూ, అందరికంటే చిన్నవాడూ గూడ నారాయణమూర్తి కెదురుగావచ్చి కూర్చున్నారు.

"అంత దారుణమైన తెలివితేటలు కలవాడు కనుకనే వాడు బాల సంఘం పెట్టాడు" అన్నాడు నారాయణమూర్తి.

రెండోవాడు వూరుకోలేదు. బాల సంఘం ఏమిటి? అన్నాడు. పెద్దవాడు "బలేవాడే! బాలసంఘం యెందుకు?" అన్నాడు. చిన్నవాడు అన్నీ తెలిసినట్లుగా "హీఁ హీఁ హీఁ అన్నాడు.

"పాఠాలొచ్చిన కుర్రాళ్ళు పాఠాలు రానివాళ్ళకి

పాఠాలు చెప్పటం; పుస్తకాలున్నవాళ్ళు పుస్తకాల్లేనివాళ్ళకి పుస్తకాలియ్యటం, చిరుతిళ్ళు తెచ్చుకున్నవాళ్ళు చిరుతిళ్ళు లేనివాళ్ళకి చిరుతిళ్ళు పెట్టడం; బాలబాలిక లందరూ ఒకచోట చేరటం; ఆటలాడుకోవటం; కథలు చెప్పుకోవటం యిట్లాగే...

"బలే దారుణమైన సంఘమే!" అన్నాడు రెండోవాడు. నారాయణమూర్తి మాట నారాయణమూర్తికే నచ్చ చెబుతూ.

"ఇట్లా వుండగా ఒకనాడు వాళ్ళ నాన్నను జైల్లో పెట్టారు ఖైదు చేశారు."

"ఎందుకని?" అన్నాడు రెండోవాడు. ఎప్పుడూ అడిగే ప్రశ్న అడిగినట్లే.

"ఎందుక నేమిటి ? తిండిలేనివాళ్ళకి తిండిపెట్టమనీ, బట్టలులేనివాళ్ళకి బట్టలిమ్మనీ, ఇళ్ళులేనివాళ్ళకి యిల్లిమ్మనీ, చదువులేనివాళ్ళకి చదువు చెప్పమనీ అంటే యెట్లా వూరుకుంటారు?" అని అడిగాడు నారాయణమూర్తి.

"ఎందుకని వూరుకోరు?" అన్నాడు రెండోవాడు, తన చెయ్యి క్రిందవటం యిష్టలేక నేమో.

తిండీ, బట్టా దాచుకుని యెక్కువధరలకి అమ్మేందుకు వీలుండదు గనక, అందరూ చదువుకుంటే అందరికీ ఆలోచన అబ్బుతుంది గనకా!"

"ఆలోచన అబ్బితే యేం ?"

"ఆలోచన అబ్బితే తెలివికలవాళ్ళూ, కష్టపడేవాళ్ళూ

పైకొస్తారుగనక. వాళ్లు పైకొస్తే సోమరపోతులూ, కష్టపడని వాళ్ళు బ్రతకలేరుగనక" అన్నాడు నారాయణమూర్తి.

అందరికంటే పెద్దవాడికి కోపంవచ్చింది. "కథ చెప్ప నియ్యవేంరా?" అన్నాడు. తనకంటే చిన్నవాడు ముక్కుముందు జారే చీమిడి ఎగచీదాడు.

నారాయణమూర్తి మొదలుపెట్టాడు. నాన్నని జైల్లో పెడితే వాళ్ళబ్బాయికి కోపం వచ్చింది. కోపంవస్తేవాడు బాల సంఘాన్ని పిలిచాడు. పిలిచి యివ్వాళ మా నాన్నయ్యాడు ? రేపు మీ నాన్నవుతాడు అన్నాడు. మా నాన్న లేకపోతే మాకు అన్నం సంపాయించి పెట్టేవాళ్ళేరి ? అని అడిగాడు వాళ్ళని. మా యింటికి రమ్మంటే మా యింటికిరమ్మనారు అందరూ. అయినా వాడు వెళ్ళలేదు;

"ఎందుకని?" అన్నాడు పెద్దవాడి పెద్దతమ్ముడు.

"మీ యింటికొచ్చి యెంతకాలముంటాను. మీ నాన్న లకి చెప్పి మా నాన్నని వదిలిపెట్టించాలి." అన్నాడు వాడు.

రెండోవాడు "వదిలిపెట్టించారా ?" అని అడిగాడు.

"కథ చెప్పనివ్వరా అంటే" అన్నాడు పెద్దవాడు విసుగ్గా. నారాయణమూర్తి చెప్పాడు. వాళ్లూ తెలివితక్కువ వాళ్ళుకాదు. 'వాళ్ళ నాన్న చిన్న జైల్లోవుంటే మేం పెద్ద జైల్లో వున్నాం. వాళ్ళ నాన్న జైలుకి గోడలుంటే మా జైలుకి గోడ్లలేవు. అంతే తేడా ! అన్నారు వాళ్ళు. మే మే మన్నా అంటే మేంగూడ గోడలున్న జైలుకివెళ్లాళి. అమ్మో" అని గూడ అన్నారు వాళ్ళు.

"ఛ !" అన్నాడు. ఆ రేళ్ళవాడు. పెద్దవాడు తన పెద్ద తమ్ముడి నెత్తిమీద ఒక మొట్టు మొట్టి "మీరు చెప్పండి!" అన్నాడు నారాయణమూర్తితో. నారాయణ మూర్తి నవ్వుకున్నాడు.

నారాయణమూర్తి కథ సాగించాడు. పెద్దవాళ్ళ మాటలు చిన్నవాళ్ళకి రుచించలేదు. ఎందుకనోగాని వాళ్ళ కామాటలు నచ్చలేదు. దీనికితోడు ఆ దారుణమైన తెలివి తేటలున్న కుర్రాడు సుమతీ శతకంలో "బలవంతమైన సర్పము" అన్న పద్యం చదివి వినిపించాడు వాళ్ళకి. వాళ్ళందరూ సరే నంటే సరే ననుకున్నారు. అర్ధరాత్రిపూట వెళ్ళి ఏంచేశారో ఏమోగాని, ఆ అబ్బాయి నాన్నని వూళ్ళోకి తెచ్చారు.

ఆవిడ కునుకు తియ్యాలని సతమతమౌతోంది. లాభం కన్పించలేదు. ఇంకా యిట్లాగే కాస్సేపు కథ నడుస్తుందా అని ప్రశ్నించుకున్నది తన్ను తాను.

ఈ సారి రెండోవాడు "ఎట్లా తెచ్చారు ?" అని అడుగు తాడేమోనని భయపడింది ఆవిడ. వాడా ప్రశ్న వెయ్యటం లేదు. "రక్షించావురా నాయనా!" అనుకుందామనుకున్నది ఆవిడ. ఆవిడ అట్లా అనుకుంటుండగానే రెండోవాడు "అప్పుడే అయిపోయిందా కథ ? అన్నాడు."

"అప్పుడే ఎట్లా అయిపోయింది?" అని యేమిటో చెప్ప బోతున్నాడు నారాయణమూర్తి.

ఇంతలో చలిమిడిసుద్ద కదిలి గుమ్మడికాయై దొర్లింది. "స్టేషనొచ్చింది. దిగరేంరా తిప్పకాయల్లారా !" అని ఆవిడ ప్లాట్ ఫారంమీదికి దూకింది. పెద్దవాడూ అంత కంటే చిన్నవాడూ ఆ చిన్నవాడి కంటే చిన్నవాడూ యింకా రైలు దిగలేదు.

"ప్రాయోకాలం వచ్చింది" అనుకుంది ఆవిడ.

రైలు కదిలేట్టుంది—

ఐనా వాళ్ళింకా రైలు దిగలేదు.

—:—